క్లుప్తంగా

మోపిదేవి గ్రామ కార్యదర్శిగా రామకోటేశ్వరరావు

మోపిదేవి: మోపిదేవి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కొల్లిపర రామకోటేశ్వరరావు బుధవారం ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న త్రిపురసుందరి ఈఓపీఆర్డీగా పదోన్నతిపై బంటుమిల్లి మండలానికి బదిలీ అయ్యారు. మెరకనపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రామకోటేశ్వరరావును ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటికే ఆయన పెదప్రోలు, కె.కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక, ఉత్తర చిరువోలులంక, మేళ్లమర్తిలంక గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. మోపిదేవికి ఇన్‌చార్జి బాధ్యతల నియామక పత్రాన్ని బుధవారం సర్పంచ్ నందిగం మేరీరాణికి అందజేశారు. పాలకవర్గ సభ్యులు కేసగాని రాంబాబు, నందిగం అభిషేకరావు అభినందించారు.

అవనిగడ్డ సీఐగా రమేష్

అవనిగడ్డ: అవనిగడ్డ సీఐగా ఎల్. రమేష్‌ను నియమిస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో సీసీఎస్‌గా పనిచేస్తున్న రమేష్‌ని అవనిగడ్డ సీఐగా బదిలీ చేయగా.. ఇక్కడ పనిచేసిన సీఐ జి. శ్రీనివాస్‌ని ఏలూరు రేంజ్ కార్యాలయానికి వీఆర్‌లోకి తీసుకున్నారు.

సోషల్ అధ్యాపకురాలు సోనియాకు డాక్టరేట్



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నానికి చెందిన సోషల్ అధ్యాపకురాలు దోవారి సోనియాకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనివర్సిటీలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి. రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కడప చిన్నచౌక్‌లో ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలో సోషల్ అధ్యాపకురాలిగా ఆమె పనిచేస్తున్నారు. ఆర్థిక శాస్త్రంలో ప్రాబ్లమ్స్ ఆఫ్ గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్ త్రూ సర్వశిక్షా అభియాన్ అంశంపై కృష్ణా జిల్లాలో సర్వే చేసి పరిశోధన పత్రాలను ఆమె సమర్పించారు. దీనికి గానూ ఆమెకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకున్న సోనియాకు పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయ కరాటే పోటీల్లో కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ



బంటుమిల్లి: కర్నూలు పట్టణంలో నిర్వహించిన 11వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన పోటీలు నిర్వహించగా ఫలితాలు బుధవారం ప్రకటించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో 12, 10, 9, 8 సంవత్సరాల కటా విభాగంలో బి. చాతుర్య, ఎ. పూర్ణశ్రీ, కె. హర్షిణి, ఎం. ప్రతిమ, పి. యోక్షిత ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాలతో మెడల్స్ సాధించారని చెప్పారు. విజేతలను, కోచ్ వెంకటేశ్వరరావును డైరెక్టరు కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మచిలీపట్నంటౌన్: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినందుకు గానూ దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ మహిళా మోర్చా నాయకులు క్షీరాభిషేకం చేశారు. స్థానిక లక్ష్మీటాకీసు సెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకులు దోవారి ధనలక్ష్మి, తలాటం పద్మావతి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎన్. గాయత్రి, మార్తమ్మ, లక్ష్మీకుమారి, రంగనాథ్, డి. శ్రీరామచంద్రమూర్తి, పంతం గజేంద్ర, ఘంటా సతీష్ పాల్గొన్నారు.

ఆ రేవుల్లో నిమజ్జనాలకు అనుమతి లేదు

చల్లపల్లి: మండలంలోని నడకుదురు, రాముడుపాలెం కృష్ణానది రేవుల వద్ద వినాయక నిమజ్జనాలకు అనుమతి లేదని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిమజ్జన ఏర్పాట్లపై తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎస్ఐ సీహెచ్. చినబాబు సమావేశం నిర్వహించారు. నడకుదురు, రాముడుపాలెం రేవుల వద్ద నదిలో నీరు తక్కువగా ఉన్న నేపథ్యంలో నిమజ్జనాలకు అనువుగా లేదని తెలిపారు. మండలంలోని ఉత్సవ కమిటీల వారు పులిగడ్డ, శ్రీకాకుళం రేవుల వద్ద నిమజ్జనాలు నిర్వహించుకోవాలని సూచించారు. నడకుదురు, రాముడుపాలెం రేవుల వద్ద నీరు ఉన్న ప్రదేశాలకు రేవు లోపల, నిర్జన ప్రదేశాలకు వెళ్లి భక్తులు ఇబ్బంది పడకూడదని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

అందరికీ వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



వీక్లీ ఆరోగ్య మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వీక్లీ ఆరోగ్య మేళా ప్రారంభం
- 206 మందికి వైద్య పరీక్షలు.. మందులు అందజేత

అవనిగడ్డ: అందరికీ వైద్యం అందించాలన్నదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన వీక్లీ ఆరోగ్య మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించి మాట్లాడారు. అందరికీ వైద్యం అందాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీక్లీ ఆరోగ్య మేళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధునిక పరికరాలను సమకూరుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయడంతో పాటు గ్రామీణ, మండల స్థాయిలోనే వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య సేవల కోసం వచ్చిన గర్భిణులు, మహిళలు, వృద్ధులను ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శించి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్ మాట్లాడుతూ వీక్లీ ఆరోగ్య మేళా ద్వారా తొలి రోజు 206 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

లక్ష్మీపురం(చల్లపల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం సాయంత్రం చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌బాబు రామానగరంలో 528 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. విస్తృత సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఫలించిందన్నారు. సీఎం జగనన్న పట్టణాలు, గ్రామాల్లో విద్యా రంగాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారని చెప్పారు. గ్రామ స్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించారని తెలిపారు. పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంకొల్లు శేషగిరి, సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, అవనిగడ్డ, ఘంటసాల జెడ్పీటీసీలు చింతలపూడి లక్ష్మీనారాయణ, తుమ్మల మురళీకృష్ణ, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు నాగ సీతారామారావు (ఫణి), శీరం వెంకట సత్యనారాయణ (నాని), ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. తొలుత మండల పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- మేయర్ వెంకటేశ్వరమ్మ
- నగరంలో విస్తృతంగా పర్యటన



వాల్వ్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ హెచ్చరించారు. బుధవారం నగరంలోని పలు డివిజన్లలో ఆమె పర్యటించారు. కోనేరు సెంటర్‌తో పాటు సమీపంలోని నగిరి చెన్నయ్య మార్కెట్, నారకొట్ల బజారు, కెనడీ రోడ్డు, సామావారి వీధి తదితర ప్రాంతాల్లో నడుస్తూ పారిశుద్ధ్య పనులను, తాగునీటి సరఫరా తీరును ఆ ప్రాంత ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సామా వారి వీధిలో జరుగుతున్న వాల్వ్ మరమ్మతు పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నగరంతో పాటు కోనేరు సెంటర్ ప్రాంతంలో దుకాణదారులు వారి దుకాణాల్లోని వ్యర్థాలను రోడ్లపై అస్తవ్యస్తంగా పడవేయకుండా డస్ట్‌బిన్లలో వేసి చెత్త వాహనాలకు అందించాలని మేయర్ సూచించారు. చెత్తను రోడ్లపై పడవేసే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్మికుల పారిశుద్ధ్య పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పారిశుద్ధ్యం మెరుగునకు కృషి చేయాలని చెప్పారు. అనంతరం ఖొజ్జిల్లిపేటలోని నాగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాగం ధర్మరాజు మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ విజయలక్ష్మీలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో నాణ్యమైన వైద్యం

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ వైద్య రంగం పూర్తి స్థాయిలో బలోపేతమైందని ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్ అన్నారు. బుధవారం స్థానిక కస్తూరిబా మెమోరియల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ కార్యక్రమం ద్వారా ప్రతి వారం ఆరోగ్య మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, సీహెచ్‌సీ డైరెక్టర్ అబ్దుల్ కరీం, ఏఎంసీ డైరెక్టర్లు మోతుకూరి ఏడుకొండలు, అబ్దుల్ అర్షద్, వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వెంకట్రావ్

ఏకదంతాయ.. వక్రతుండాయ

- మూడో రోజుకు చేరిన చవితి వేడుకలు
- గణపయ్యకు ప్రత్యేక పూజలు



పెడన ఒకటో వార్డులో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న జోగి రాజీవ్



నాగాయలంకలో హోమంలో పాల్గొన్న శ్రీనివాస్ దంపతులు



మోపిదేవి దేవస్థానంలో నెలకొల్పిన విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ అధికారులు, భక్తులు



బంటుమిల్లి రజక వీధిలో వినాయక ప్రతిమ వద్ద పూజల్లో పాల్గొన్న దంపతులు

పెడన: వినాయక చవితి వేడుకలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని పలు కూడళ్లలో వివిధ రూపాల్లోని గణనాథుల ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల అన్నసమారాధనలు నిర్వహించి సాయంత్రం గణపయ్యలను నిమజ్జనం చేశారు. మరికొన్ని చోట్ల ప్రత్యేక పూజలు, వినాయక గీతాలను ఆలపించారు. ఒకటో వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ వద్ద వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు జోగి రాజీవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధనను ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, పట్టణ కన్వీనర్ మల్లి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం..

నాగాయలంక: గ్రామంలో 66వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవా కొనసాగుతున్నాయి. నిత్యహోమాలలో భాగంగా బుధవారం ప్రసన్న గణపతి దేవస్థానంలో శ్రీలక్ష్మీ గణపతిహోమం వైభవంగా జరిగింది. అంబా సాయికిరణ్‌శర్మ (కౌశిక్) బ్రహ్మత్వంలో శ్రీరామపాద క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, సుజనకుమారి దంపతులచే విఘ్నేశ్వరుని ఉత్సవమూర్తికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం హోమ పూజలు జరిపి పూర్ణాహుతి సమర్పించారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల పందిరిలో బుధవారం పొన్నూరు సుధాకర్, మారుతి దంపతులచే ఉత్సవ విగ్రహానికి పూజలు జరిగాయి. అనంతరం కాట్రగడ్డ రామ్మోహన్‌రావు ఆర్థిక సాయంతో బి.లక్ష్మీనారాయణ భాగవతార్‌చే హరికథా గానం జరిగింది.

కృష్ణానదిలో నిమజ్జనం..

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నెలకొల్పిన గణేశుని విగ్రహాన్ని సమీపంలోని కృష్ణానదిలో బుధవారం నిమజ్జనం చేశారు. ఉదయం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలు, డప్పు కళాకారుల సందడితో ప్రత్యేక వాహనంలో స్వామివారిని మోపిదేవి వార్పు వద్ద కృష్ణానదికి తరలించారు. గణేశుని చేతిలో ఉన్న లడ్డూకు బహిరంగ వేలం నిర్వహించగా ఆలయ అర్చకులు ప్రసాద్ రూ. 1,500లకు కైవసం చేసుకున్నారు.

బంటుమిల్లి: మండలంలో గణేష్ చతుర్థి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పండితుల వేద మంత్రాల మధ్య బొజ్జ గణపయ్యకు పూజలు నిర్వహించారు. స్థానిక గాంధీ మండపం సెంటర్‌లో వూర సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు 40 ఏళ్లుగా వినాయక చవితి పండుగ సందర్భంగా వార్షికంగా అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. బుధవారం కుమారుడు వూర బాబు, మనవళ్ల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించగా వేలాదిమంది పాల్గొన్నారు.

మోపిదేవి: మోపిదేవిలో నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, ప్రభావతి దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. రావివారిపాలెం కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి కొండపల్లి శ్రీనివాసరావు, ప్రమీలారాణి దంపతులు, మోపిదేవి రాఘవేంద్రరావు, నాగలక్ష్మీ దంపతులు, రావి రత్నగిరి కుమారుడు వరుణ్‌తేజ్ అడుసుమిల్లి శ్రీనివాసరావు అర్చకత్వంలో ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోడూరు: కోడూరులోని షిర్డీ సాయి దివ్యసాయి ధాన్య జ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు మంత్రోచ్చరణల నడుమ పలువురు భక్తులు ఉభయదాతలుగా వ్యవహరించి సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడి కల్యాణాన్ని నిర్వహించారు. ఉల్లిపాలెం, లింగారెడ్డిపాలెం, యర్రారెడ్డివారిపాలెం, జరుగువానిపాలెం గ్రామాల్లో లంబోదరుడి విగ్రహాల వద్ద నవరాత్రి ఉత్సవాలను భక్తిప్రపత్తులతో జరుపుతున్నారు. మందిర కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్

పేర్ని కిట్టు



లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందజేస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. పల్లెతుమ్మలపాలెం, కోన, తుమ్మలచెరువు, వాడపాలెం, కేపీటీ పాలెం, ఎస్ గొల్లపాలెం, పెదయాదర, భోగిరెడ్డిపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పెన్షన్లను బుధవారం కిట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడు సంతోషంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. అందుకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హత ఉండీ పెన్షన్లు పొందలేని వారిని వలంటీర్ల ద్వారా గుర్తించి కొత్త పెన్షన్లు అందజేస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా రాష్ట్రంలో ఏ ఒక్క పేద వాడు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. అన్నివర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి జగనన్న అండగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జీలు, గ్రామ కన్వీనర్లు, వార్డు కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



దుర్గామహల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకునికి లేస్ ప్యాకెట్లతో అలంకారం



రాధిక థియేటర్ సెంటర్‌లో వన వినాయకుడి అలంకరణ



సంతోష్ హోటల్ వద్ద శివుని విగ్రహంతో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



భారీ అలంకారంతో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం

ఆకట్టుకుంటున్న అలంకరణలు

గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారానికి మూడో రోజుకు చేరాయి. నగరంలోని పలు కూడళ్లు, పేటల్లో నవరాత్రి పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలకు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించారు. సాయంత్రం గణనాథుని విగ్రహాల వద్ద పలు రకాల వస్తువులతో చేసిన ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకున్నాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. –మచిలీపట్నంటౌన్

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

డీఎంహెచ్‌ఓ గీతాబాయ్



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయ్

చల్లపల్లి: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయ్ అన్నారు. బుధవారం చల్లపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జిల్లాలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని చెప్పారు. స్కానింగ్ కేంద్రాల వారు అన్ని అనుమతులు కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు ఉల్లంఘించి స్కానింగ్ చేస్తే ఐఎంఏ సభ్యత్వం కూడా రద్దయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

పొలం వివాదంలో ఇరువర్గాలపై కేసులు

పెడన: మండల పరిధి నందిగామలో నాలుగు ఎకరాల పొలం విక్రయించే విషయంలో కొనుగోలు దారునికి, మధ్యవర్తికి మధ్య జరిగిన గొడవలపై పెడన పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుమల్లి గ్రామానికి చెందిన అర్జ మురళీమోహనరావు మధ్యవర్తిగా ఉండి పెడన మండలం నందిగామ గ్రామానికి చెందిన ఒకరి నుంచి నాలుగు ఎకరాలు పొలం విక్రయించడానికి సిద్ధమయ్యారు. గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడుకు చెందిన శేషం రాజశేఖర్ రూ.3 లక్షలు అడ్వాన్స్ ఇచ్చి రిజిస్ట్రేషన్ సమయంలో మిగిలిన సొమ్ము చెల్లిస్తానని చెప్పారు. నెలలు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడం, తీవ్ర జాప్యం చేస్తుండటంపై శేషం రాజశేఖర్‌ను మధ్యవర్తి మురళీమోహనరావు నిలదీశారు. మురళీమోహన్‌రావు ఇష్టానుసారంగా తనను దూషించి దాడికి యత్నించాడని రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కాగా, శేషం రాజశేఖర్‌తో పాటు మరో ముగ్గురు తనపై దాడి చేయడంతో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రి లో చికిత్స పొందుతున్నానని మురళీమోహన్‌రావు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు.

చిట్టిచేతులతో బుల్లి మండపం ..



నాగాయలంక: నాగాయలంక కృష్ణానది ఒడ్డున చిన్న కరకట్ట (వరద కట్ట)రోడ్డులో మత్స్య పారిశ్రామిక కాలనీ బాలికలు ముగ్గురు ఏర్పాటు చేసిన బుల్లి గణేశ మండపం ఆకట్టుకుంటోంది. కాలనీకి చెందిన మల్లాడి శైలజ, రిసశ్రీ, కోలా మేఘన గుర్తింపు పొందిన స్కాలర్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 3, 4 తరగతులు చదువుతున్నారు. వీరు బుల్లి ఉత్సవ మండపం వేసి రెండు చిన్న మట్టి గణేశుని ప్రతిమలను పెట్టి ప్రతి రోజూ పూజలు చేసి పాఠశాలకు వెళుతున్నారు. అరటిపండు, జామకాయలు నైవేద్యంగా సమర్పిస్తున్నారు. తమ పాఠశాలలో జరిగే విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు ఈ బుల్లి మండపం ఏర్పాటుకు ప్రేరణ ఇచ్చాయని బాలికలు తెలిపారు. ఐదో రోజు లేదా తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తామని వారు తెలిపారు.

విద్యార్థుల రక్త నమూనాల సేకరణ

గుడివాడ టౌన్: స్థానిక ప్రాంతీయ హోమియో పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్‌జే రాజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రీయ పోషణ మహోత్సవం, అంతర్జాతీయ మిల్లెట్స్ ఇయర్‌ను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి రక్తహీనత గల వారిని గుర్తించామన్నారు. మందులను ఉచితంగా అందజేశారు.